
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్
3
సోమవారం 2 జూన్ 2025
జిల్లాల వార్తలు





జోగిపేటలో కొనసాగుతున్న పనులు

మురుగు ముప్పు ఉండదిక

జోగిపేట పట్టణంలో రూ. 2.40 కోట్లతో అండర్ డ్రైనేజీ నిర్మాణం

కొనసాగుతున్న పనులు

నెల రోజుల్లో పూర్తికి చర్యలు

మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం

6

ఒయాసిస్ జననీ ఫెర్టిలిటీ సేవలను
సద్వినియోగం చేసుకోవాలి

టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి



ఒయాసిస్ జననీ ఫెర్టిలిటీ ప్రచార బస్సును ప్రారంభిస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డి అర్బన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని జేఎస్ఆర్ గార్డెన్స్‌లో ఒయాసిస్ జనని ఫెర్టిలిటీ ప్రచార బస్సును ఆదివారం తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మలాజగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రచార బస్సు ఊరూరు తిరుగుతూ పిల్లలు కానీ దంపతులకు చాలా తక్కువ ఖర్చుతో పరీక్షలు, వారికి కావాల్సిన వైద్యం చేస్తారని ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.



ఒయాసిస్ జననీ ఫెర్టిలిటీ ప్రచార కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

క్షేత్రస్థాయి పరిశీలనతోనే
భూసమస్యల పరిష్కారం

- భూ భారతి సదస్సుల్లో 1,718 దరఖాస్తులు
- 800 సమస్యలు కొలిక్కి : ఆర్డీవో రవీందర్‌రెడ్డి



రెవెన్యూ సదస్సులో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్డీవో రవీందర్‌రెడ్డి

కొండాపూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : భూ భారతి రెవెన్యూ సదస్సులో నిజనిర్ధారణ నివేదిక ప్రణాళికలతో పరిశీలించి భూ సమస్యలను పరిష్కరించాలని ఆర్డీవో రవీందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కొండాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం ఆయన అధికారులతో సమావేశమైన రెవెన్యూ సదస్సుల దరఖాస్తులపై చర్చించారు. సమస్యల పరిష్కారానికి పలు సూచనలను చేశారు. రెవెన్యూ సదస్సుల్లో 1,718 దరఖాస్తులు వచ్చాయని, 800 సమస్యలను పరిశీలించి పరిష్కార మార్గాలను సూచిస్తూ ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చామని తెలిపారు. మిగిలిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పారదర్శకంగా పరిశీలించి రైతులకు మేలు జరిగేలా పరిష్కరించాలని ఆదేశించారు.

కొలిక్కిరాని 'వికాసం'

నేడు మంజూరు పత్రాలు ఇస్తామని ప్రకటన

పూర్తికాని లబ్ధిదారుల ఎంపిక

ఇంకా టైమ్ ఉందంటున్న అధికారులు

దరఖాస్తుదారుల నిరీక్షణ




మెదక్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిరుద్యోగ యువతకు స్వయంఉపాధి చేపట్టేందుకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువవికాసం పథకం లబ్ధిదారుల ఎంపిక ఇంకా కొలిక్కిరాలేదు. తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నేడు లబ్ధిదారులకు రుణాలు అందజేయనున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. కానీ, వాస్తవ పరిస్థితి మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉంది. జిల్లావ్యాప్తంగా రాజీవ్ యువవికాసం పథకానికి 32వేల దరఖాస్తులు అందాయి. దరఖాస్తుల పరిశీలన బాధ్యతలను మండల, మున్సిపల్ అధికారులకు అప్పగించారు. బీసీ, ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్ల జిల్లా అధికారులు అప్లికేషన్లను క్షుణ్ణంగా పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు.

సిబిల్ స్కోరు, బకాయిల పరిశీలన

లబ్ధిదారులు గతంలో పొందిన రుణాలు, సిబిల్ స్కోరు, బకాయిలు వంటి అంశాలను బ్యాంకర్లు పరిశీలిస్తున్నట్లు సమాచారం. బ్యాంకుల పరిశీలన తర్వాత అర్హుల జాబితాలను మండల, మున్సిపల్ అధికారులు పరిశీలించి జిల్లా అధికారులకు పంపిస్తున్నట్లు ఓ అధికారి తెలిపారు. జిల్లా స్థాయి కమిటీ అర్హులను ఎంపిక చేసిన తర్వాత ఈ నెల 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని లబ్ధిదారులకు రుణ మంజూరు పత్రాలు పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. మొదట రూ.50 వేల నుంచి రూ. లక్ష వరకు దరఖాస్తు చేసుకున్నవారికి జూన్ 2న సాంక్షన్ లెటర్లు ఇస్తామని పేర్కొన్నారు. ఆ తర్వాత జూన్ 9వ తేదీ వరకు రుణ మంజూరు పత్రాలు పంపిణీ చేయనున్నట్లు

మిగతా 6వ పేజీలో

సర్దుబాటుకు కసరత్తు



విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాలలకు టీచర్ల కేటాయింపు

జిల్లా కలెక్టర్ ఆమోదంతో అవసరమైన చోటుకు బదిలీ

ఉత్తర్వులు జారీచేసిన విద్యాశాఖ

సంగారెడ్డి జిల్లాలో గతేడాది 156 మంది టీచర్ల సర్దుబాటు

తాజా వివరాలు సేకరిస్తున్న విద్యాశాఖ

జిల్లాకు మంజూరైన పోస్టులు 6,013

ప్రస్తుతం పనిచేస్తున్నది 5,373 మంది

సంగారెడ్డి అర్బన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : సర్కారు బడుల్లో ఉపాధ్యాయులు లేనిచోట.. అదనంగా ఉన్న ఇతర పాఠశాల నుంచి సర్దుబాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఉపాధ్యాయుల సర్దుబాటుకు విధివిధానాలను రూపొందించింది. జూన్ 12వ తేదీన పాఠశాలలు పున:ప్రారంభం కానున్నాయి. ఆ లోపే టీచర్ల సర్దుబాటును పూర్తిచేసి, కేటాయించబడిన బడిలో విధుల్లో చేరేలా సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేయాలని విద్యాశాఖ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఉపాధ్యాయుల మ్యూచువల్ బదిలీల తరహాలో సర్దుబాటు చేయడానికి వీల్లేదని, కలెక్టర్ ఆమోదంతోనే ప్రక్రియ చేపట్టాలని ఆదేశించింది.

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా..

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగానే టీచర్లను సర్దుబాటు చేయనున్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో 1-10 మంది విద్యార్థులుంటే ఒక టీచర్, 11-60 మందికి ఇద్దరు, 61-90 మందికి ముగ్గురు, 91-120 మందికి నలుగురు, 121-150 మందికి ఐదుగురు, 151-200 మందికి ఆరుగురు, 200 మంది దాటిన చోట ప్రతీ 40 మందికి ఒక టీచర్‌ను కేటాయిస్తారు. 6 నుంచి 8 తరగతుల వరకు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలల్లో 1-20 మంది విద్యార్థులుంటే ఒక ల్యాంగ్వేజ్ టీచర్, ఒక నాన్ లాంగ్వేజ్ టీచర్‌ను సర్దుబాటు చేయనున్నారు. ఒక పంచాయతీ పరిధిలో టీచర్ల సర్దుబాటు అవసరం లేకుంటే స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో సర్దుబాటు చేస్తారు. అక్కడా అవసరం లేకుంటే మండల పరిధిలో.. ఆ తర్వాత పక్క మండలంలో.. అనంతరం జిల్లా పరిధిలో సర్దుబాటు చేస్తారు. ఒకే ప్రాంగణంలో రెండు ప్రాథమిక పాఠశాలుంటే ఒకటిగానే పరిగణించి టీచర్లను సర్దుబాటు చేస్తారు. ఒకే ప్రాంగణంలో రెండు యూపీఎస్‌లు లేదా ఒక ప్రాథమిక ఒక యూపీఎస్ ఉంటే

మిగతా 6వ పేజీలో

కార్మికుల శ్రేయస్సు కోసం
సీఐటీయూ కృషి

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు

జహీరాబాద్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కార్మికుల శ్రేయస్సు కోసం సీఐటీయూ నిరంతరతం కృషి చేస్తుందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు పేర్కొన్నారు. జహీరాబాద్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం రాత్రి నిర్వహించిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఐటీయూ యూనియన్ గెలుపొందిన కర్మాగారాల్లో మెరుగైన వేతన ఒప్పందాలను ఇప్పించామని పేర్కొన్నారు. ఎన్నికలప్పుడే పుట్టుకొచ్చే సంఘాలకు కార్మికుల సమస్యలపై అవగాహన ఉండదని విమర్శించారు. ట్రేడ్‌యూనియన్ల బాధ్యతలపై అవగాహన ఉండదని, కార్మికుల సమస్యలను ఎలా పరిష్కరించాలో తెలియదని అన్నారు. కార్మికుల బాగు కోసం నిరతంతరం శ్రమించే యూనియన్ సీఐటీయూ మాత్రమేనని స్పష్టం చేశారు.

మహీంద్రా కర్మాగారంలో
ఎన్నికల కోలాహలం

అధ్యక్ష పదవికి హోరాహోరీ

సీఐటీయూ వర్సెస్ ఐఎన్‌టీయూసీ

5

కాల్పులు కాదు.. చర్చలు జరగాలి

- అడవుల్లో రక్తపుటేరులు పారించడం తగదు
- అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య చైర్మన్ విమలక్క

పాపన్నపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అణిచివేత ధోరణిని వదిలేయాలని, ఎన్‌కౌంటర్ల పేరిట అడవుల్లో రక్తపుటేరులు పారించడం ఆపాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య చైర్మన్ విమలక్క పేర్కొన్నారు. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం అన్నారం గ్రామంలో ఆదివారం నిర్వహించిన అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణలో ఆమె పాల్గొన్నారు. అనంతరం కొత్తపల్లిలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజల కోసం పోరాడుతున్న వారిపై అణిచివేత తగదన్నారు. మెదక్ జిల్లాతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని పేర్కొన్నారు. అంబేడ్కర్ కులదురహంకారం, ఆర్థిక సమానత్వం లేని సమాజాన్ని, పేదల అభ్యున్నతిని, సహజ న్యాయాన్ని కోరుకున్నారని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు దోపిడీ కొనసాగుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ఉమ్మడి జిల్లా దౌల్తాబాద్ మండలం సూరంపల్లిలో దళితులు బతుకమ్మ పండుగ నిర్వహించుకోలేని దుస్థితిని తాము ఎదిరించామని చెప్పారు. కార్యక్రమంలో లంబాడా హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు దానురాం నాయక్, విద్యుత్‌శాఖ డీఈలు అమృత్‌రావు, లూథర్ జనప్రియ, నాయకులు జనార్దన్‌రావు, గణేష్ మాస్టర్, బొందుగుల నాగరాజు, నల్లోల సంజీవయ్య, బట్టి చెన్నయ్య, దేవరాజ్‌గౌడ్, ముక్బుద్, జెల్ల సుధాకర్, అహ్మద్ లలీ, బాలాగౌడ్, చెదల భాస్కర్, యశోద తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య చైర్మన్ విమలక్క



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన విమలక్క

విషం చిమ్ముతున్నాయ్!

పరిశ్రమల కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి

ఊపిరాడటం లేదంటున్న పరిసర గ్రామాల ప్రజలు

ఫిర్యాదు చేసినా పట్టించుకోని పీసీబీ అధికారులు

5

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

5

ఐఐటీహెచ్‌లో ముగిసిన 'స్పిక్ మైకే'



విద్యుద్దీపాల వెలుగులో మెదక్ కలెక్టరేట్

రాష్ట్ర అవతరణ వేడుకలకు సర్వం సిద్ధం

మెదక్ కల్చరల్/సంగారెడ్డి క్రైం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ అవతరణ దినోత్సవానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మెదక్‌లో నేడు నిర్వహించే వేడుకలకు ప్రభుత్వ సలహాదారుడు కేశవరావు హాజరుకానున్నారు. ఏర్పాట్లను కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు ఎస్పీ మహేందర్, ఆర్డీవో రమాదేవి, డీఎస్పీ ప్రసన్నకుమార్ పరిశీలించారు. సంగారెడ్డిలోని పోలీస్ పెరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించే వేడుకల్లో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ జాతీయ పతాకాన్ని ఎగురవేయనున్నారు. అనంతరం శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, స్టాళ్ల ప్రదర్శన ఉంటాయి. కలెక్టరేట్, ప్రభుత్వ కార్యాలయాలను అలంకరించారు.



సంగారెడ్డి కలెక్టరేట్

మెడికోలకు కొత్త భవనాలు

నేటి నుంచి ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభం

సంగారెడ్డి అర్బన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ తరగతులు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. వేసవి సెలవులు ముగియడంతో మెడికోలు కళాశాల బాటపటాబరు. మెడికల్ కళాశాల ప్రాంగణంలో విద్యార్థుల కోసం నూతనంగా నిర్మించిన హాస్టల్స్ సిద్ధమయ్యాయి. ఇలా ఉండగా 150 ఎంబీబీఎస్ సీట్లతో 2021 సంవత్సరంలో ఇక్కడ కళాశాలను నెలకొల్పారు. అప్పటి నుంచి అద్దె భవనాల్లోనే హాస్టల్ వసతి కల్పించారు. ప్రస్తుతం 450 మంది వైద్య విద్యార్థులతో మూడో విద్యా సంవత్సరం కొనసాగుతున్నది. ప్రస్తుతం సొంత భవనాలు సిద్ధం కావడంతో హాస్టల్స్‌ను తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. నేటి నుంచి సొంత భవనాల్లోనే వైద్య విద్యార్థులకు వసతి కల్పించనున్నారు. ఇన్ని రోజులు అరకొర వసతులు నడుమ అద్దె భవనాల్లో కాలం వెల్లదీసిన వైద్య విద్యార్థులకు నేటి నుంచి ఇక్కట్లు తొలగనున్నాయి. బాలురు, బాలికల కోసం ఏడు, ఎనిమిది అంతస్తుల్లో వేర్వేరుగా నిర్మించిన రెండు భవనాలు సిద్ధమయ్యాయి. హాస్టల్స్, ఇతర భవనాలను అధికారికంగా ప్రారంభించలేదు. ఈ నెలలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా భవనాల ప్రారంభోత్సవం ఉంటుందని ఆర్అండ్‌బీ, కళాశాల అధికార వర్గాలు తెలిపాయి.



సంగారెడ్డి మెడికల్ కాలేజీ కొత్త హాస్టల్ భవనాలు

బోనమెత్తిన మెదక్

మెదక్ పట్టణంలో నల్లపోచమ్మ ఆలయ 19వ వార్షికోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు హాజరై బోనం ఎత్తుకున్నారు. మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, కొండ దేవయ్య, కొత్త లక్ష్మణ్ పటేల్, ఉదయ్ కమార్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

-మెదక్ కల్చరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి)





ధాన్యం సేకరణ వారంలో పూర్తిచేస్తాం

2,95,703 మెట్రిక్ టన్నుల వడ్ల కొనుగోలు : మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

కొల్చారం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో ధాన్యం సేకరణ వారంలో పూర్తిచేస్తామని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 70,815 మంది రైతుల నుంచి 2,95,703 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి రూ. 573.60 కోట్ల రూపాయలు రైతులకు చెల్లించినట్లు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు చివరి దశకు చేరుకున్నదని, వారంలో పూర్తిచేసి కేంద్రాలను మూసివేస్తామని తెలిపారు. ఆఖరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు.



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


మోహన్ (ఫైల్)

పాపన్నపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని పొడిచన్పల్లి తండాలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకున్నది. బాధిత కుటుంబం కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన ధరావత్ మోహన్(42) హిందీ పండిత్ ట్రైనింగ్ పూర్తి చేసి డీఎస్సీ కోసం ప్రిపేర్ అవుతున్నాడు. కొత్తగా కట్టిన బాత్‌రూం గోడలు క్యూరింగ్ చేసే ఉద్దేశంతో, సింగిల్ ఫేజ్ మోటర్‌ను ఆన్ చేశాడు. మోటర్ బటన్‌కు విద్యుత్ సరఫరా కావడంతో కరెంట్ షాక్‌కు గురియై మోహన్ అక్కడికక్కడే మరణించాడు. మోహన్‌కు తల్లి భూలీబాయి, తండ్రి రామ్లాతో పాటు ముగ్గురు అన్నదమ్ములు ఉన్నారు. మోహన్ మృతితో కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మోహన్ మృతదేహాన్ని మెదక్ ఆసుపత్రికి తరలించారు.

యువతి అదృశ్యం


శ్రావణి

మనోహరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : అమ్మమ్మ ఇంటికి వెళ్లిన యువతి అదృశ్యమైన సంఘటన మండల పరిధిలో చోటుచేసుకోగా, ఆదివారం ఫిర్యాదు చేయడంతో వెలుగుచూసింది. ఎస్ఐ సుభాష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. శివ్వంపేట్ మండలంలోని శభాష్‌పల్లి గ్రామానికి చెందిన మర్తమన్ షాదుల్లా కూతరు మర్తమన్ శ్రావణి(19) అమ్మమ్మ ఇల్లు అయిన మనోహరాబాద్‌కు బుధవారం వచ్చింది. గురువారం గురువారం శభాష్‌పల్లిలోని ఇంటికి వెళుతున్నా అని అమ్మమ్మ ఇంట్లో చెప్పి బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి చేరుకులేదు. నాలుగు రోజుల నుంచి కుటుంబసభ్యులు బంధువుల వద్ద, ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం తండ్రి మర్తమన్ షాదుల్లా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బయటకు వెళ్లినప్పుడు నలుపు రంగు టాప్, గోధుమ రంగు లెగ్గిన్ దుస్తువులు ధరించిందని పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

వెల్దుర్తి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను వెల్దుర్తి పోలీసులు శనివారం రాత్రి పట్టుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని ఆరెగూడెం గ్రామ శివారు వద్ద ఉన్న హల్దీ వాగు నుంచి ఇసుక తవ్వి రెండు ట్రాక్టర్ల ద్వారా రవాణా చేస్తున్నట్లు పోలీసులకు నమ్మదగిన సమాచారం రావడంతో అక్కడికి చేరుకున్నారు. రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు ఆదివారం ట్రాక్టర్ యజమానులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నర్సాపూర్‌లో ట్రాక్టర్ చోరీ

నర్సాపూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ పట్టణంలో కాలనీలో శనివారం అర్ధరాత్రి దాటక పార్కు చేసిన ట్రాక్టర్ చోరీకి గురైంది. ఎస్ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం.. శివాలయం కాలనీలో నివసించే ఎరుకల అశోక్ తన ట్రాక్టర్‌ను రోజు మాదిరిగానే శనివారం రాత్రి నిర్మాణంలో ఉన్న మార్కెట్ యార్డు ముందు పార్కు చేసి వెళ్లారు. ఆదివారం ఉదయం ఐదు గంటల సమయంలో వెళ్లి చూసేసరికి అక్కడ ట్రాక్టర్ ఇంజన్ కనిపించలేదు. చుట్టుపక్కల చూసినా ఆనవాలు లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పగలు యాచకుడు.. రాత్రి చోరీలు


కౌడిపల్లి గ్రామ పంచాయతీ సమీపంలో యాచకుడిగా..

కౌడిపల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : పగలు మండలంలో యాచకుడి మాదిరిగా నటిస్తూ రాత్రి వేళ స్థానిక ఎల్లమ్మ ఆలయంలోని హుండీని పగలగొటి దొంగతనం చేస్తున్న వ్యక్తి ఫొటోలు మండలంలోని వివిధ సోషల్ మీడియా గ్రూప్‌లలో వైరల్‌గా మారాయి. యాచకుడు అని పగలు సహాయం చేసే వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని పలువురు యువకులు సోషల్ మీడియాలో కోరుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.

బీర్లు చల్లగా లేవని వైన్స్‌షాపు వద్ద గొడవ

● నలుగురికి గాయాలు

కుకునూరుపల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): బీర్లు చల్లగా లేవని కొనుగోలుదారులు, వైన్‌షాప్ నిర్వాహకుల మధ్య గొడవ చోటుచేసుకోగా, ఈ ఘర్షణలో నలుగురికి గాయాలైన సంఘటన కుకునూరుపల్లిలో ఆదివారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలకు కుకునూరుపల్లిలో ఆదివారం బంధువుల ఇంటి వద్దకు వచ్చిన ఇద్దరు వ్యక్తులు మండల కేంద్రంలోని గోల్డెన్ ఈగల్ వైన్స్‌షాపుకు వెళ్లి బీర్లు కావాలని అడగగా నిర్వాహకులు ఇచ్చారు. అవి చల్లగా లేవని కొనుగోలుదారులు వారిని ప్రశ్నించగా ఇవే ఉన్నాయని వారు సమాధానం ఇవ్వడంతో ఇరువురికి మధ్య ఘర్షణ చోటుచేసుకున్నది. కొనుగోలుదారులు రాళ్లతో వైన్ షాప్‌పైకి దాడి చేయగా, పలు మద్యం సీసాలు ధ్వంసమయ్యాయి. దీంతో వైన్‌షాపు నిర్వాహకులు ఆ ఇద్దరిని చితకబాదారు. విషయం తెలుసుకున్న వారి బంధువులు వైన్‌షాపు వద్దకు రావడంతో గొడవ మరింత ముదిరింది. దీంతో ఇరువర్గాలు దాడులు చేసుకున్నట్లు సమాచారం. ఈ ఘర్షణలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలైనట్లు మరో ఇద్దరికి స్వల్ప గాయాలు అయినట్లు స్థానికులు తెలిపారు.

రోడ్డుపై కూలిన భారీ వృక్షం


కాయిదంపల్లి శివారులోని రోడ్డుపైన ఉన్న ధాన్యం బస్తాలపై కూలిన చెట్టు

అల్లాదుర్గం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : వారం రోజులుగా కురుస్తున్న వర్షంతో భూమి తడిసిపోవడం, చెట్టు వేర్లు దెబ్బతినడంతో అల్లాదుర్గం మండలంలోని కాయిదంపల్లి గ్రామ శివారులో ఆదివారం భారీ వృక్షం కూలింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. కాయిదంపల్లి- అల్లాదుర్గం ప్రధాన రహదారి (పాత రోడ్డు)పై రైతులు కొందరు వరి ధాన్యాన్ని ఆరబోసి కొనుగోలు కేంద్రానికి తరలిస్తున్నారు. ఎప్పటిలాగే ఆదివారం కూడా రైతులు ఆరబోసిన ధాన్యాన్ని బస్తాలలో నింపుతున్న సమయంలో ఒక్కసారిగా భారీ శబ్దంతో మర్రి వృక్షం కూలి రోడ్డుపై పడుతుండగా పసిగట్టిన రైతులు పరుగులు తీశారు. రోడ్డుపై ఉన్న ధాన్యం బస్తాలపై చెట్టు పడింది. కాగా, ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అక్కడున్న రైతులు ఊపిరిపీల్చుకున్నారు.

పోస్టల్ యూనియన్‌కు బీఎంఎస్ సహకారం

● సంఘం రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్

సంగారెడ్డి క్రైం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి డివిజన్‌లో నూతనంగా ఆవిర్భవించిన భారతీయ పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్‌కు భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) అండగా ఉంటుందని బీఎంఎస్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జె.రామ్మోహన్ అన్నారు. ఆదివారం సంగారెడ్డి ముదిరాజ్ భవనంలో భారతీయ పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ సంగారెడ్డి డివిజన్ మొదటి జాయింట్ డివిజనల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి భారతీయ పోస్టల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పీ-3 గ్రూప్-సీ సర్కిల్ ప్రెసిడెంట్ కిషోర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన రామ్మోహన్ మాట్లాడుతూ రాబోయే కాలంలో కొత్తగా ఏర్పడిన పోస్టల్ యూనియన్ చేపట్టే అన్ని పోరాట కార్యక్రమాలకు బీఎంఎస్ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. సర్కిల్ అధ్యక్షుడు కిషోర్ మాట్లాడుతూ సంగారెడ్డి డివిజన్‌లో కొద్దికాలంలోనే భారతీయ పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భవించి మొదటి డివిజన్ సమావేశాన్ని జరుపుకోవడం అభినందనీయమన్నారు. పోస్టల్ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల అనేక సమస్యలపైన యూనియన్ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు.

కార్యవర్గం ఎన్నిక

ఈ సందర్భంగా భారతీయ పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ సంగారెడ్డి డివిజన్ పీ-3 గ్రూప్-సీ అధ్యక్షుడుగా శశిధర్, సెక్రెటరీగా పరమేశ్వర్, ట్రెజరర్‌గా మనీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే పోస్ట్‌మన్, ఎంటీఎస్ సంగారెడ్డి డివిజన్ అధ్యక్షుడుగా మోహన్, సెక్రెటరీగా రాములు, ట్రెజరర్‌గా మోహన్ దాస్ ఎన్నికయ్యారు. భారతీయ గ్రామీణ డాక్ కర్మాచారి సంఘ్ సంగారెడ్డి డివిజన్ అధ్యక్షుడుగా చంద్రశేఖర్‌రెడ్డి, సెక్రెటరీగా రాజేంద్రకుమార్, ట్రెజరర్‌గా రవీందర్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ సెక్రెటరీ పి.లక్ష్మీనారాయణ, పోస్ట్‌మ్యాన్ ఎంటీఎస్ సర్కిల్ ప్రెసిడెంట్ సి.వెంకటయ్య, ఐపీ, ఏఎస్పీ క్యాడర్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ సత్యేంద్ర కృష్ణ, యువజన సంఘాల నాయకుడు కూన వేణుగోపాల్ పాల్గొన్నారు.

రావి ఆకుపై తెలంగాణ తల్లి



నారాయణఖేడ్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : నేడు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నారాయణఖేడ్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్ట్ గుండు శివకుమార్ రావి ఆకులపై అమరవీరుల స్థూపం, వీరుల శక్తి ఐక్యత, నూతన తెలంగాణ తల్లి చిత్రాలను మలిచారు.

రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు సంగారెడ్డి జిల్లా ఉపాధ్యాయులు

సంగారెడ్డి అర్బన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని రాష్ట్ర స్థాయి విద్యా పరిశోధన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల అభివృద్ధిలో వివిధ అభ్యసన పద్ధతులపై(బెస్ట్ ప్రాక్టీస్) నిర్వహించే ఉత్తమ ప్రదర్శనకు సంగారెడ్డి జిల్లా నుంచి నలుగురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం భాస్కర్, సదాశివపేట మండలంలోని నిజాంపూర్-కె ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు సునీత, న్యాల్‌కల్ మండలం రేజింతల్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సఫియా సుల్తానాలు ఎంపికయ్యారని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి నూతన అభ్యసన ప్రక్రియ ప్రదర్శనలకు సంబంధించి జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రదర్శనకు ఎంపికైన వాటిని రాష్ట్రస్థాయికి పంపించాలని ప్రభుత్వం జిల్లా విద్యాశాఖను ఆదేశించింది. దీంతో సంగారెడ్డి జిల్లా స్థాయిలో 29 మంది ప్రదర్శనలో పాల్గొనగా జిల్లా కలెక్టర్ చైర్‌పర్సన్‌గా ఉన్న కమిటీ ఈ నలుగురిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసిందని డీఈవో తెలిపారు.




భాస్కర్, రామకృష్ణ




సునీత, సఫియా సుల్తానా

ఆర్టీసీ ఆర్ఎంగా విజయభాస్కర్

● నేడు బాధ్యతల స్వీకరణ

సంగారెడ్డి అర్బన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ మెదక్ రీజినల్ మేనేజర్(ఆర్ఎం)గా విజయభాస్కర్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయం నుంచి ఆయన బదిలీపై ఇక్కడికి రానున్నారు. ఇక్కడ ఆర్ఎంగా పనిచేస్తున్న ప్రభులత హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలోని స్టోర్స్ విభాగానికి(సీసీవోఎస్) బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆర్టీసీ ఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా నూతన ఆర్ఎం విజయభాస్కర్ సోమవారం విధుల్లో చేరనున్నారు. కాగా ఆర్ఎం కార్యాలయంలోని పర్సనల్ ఆఫీసర్(పీవో) రాజయ్య హైదరాబాద్ ప్రధాన కార్యాలయానికి బదిలీకాగా, రాణిగంజ్ డిపో నుంచి అనిత పదోన్నతిపై ఇక్కడికి పర్సనల్ ఆఫీసర్‌గా రానున్నారు.

విషం చిమ్ముతున్నాయ్!

పరిశ్రమల కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి

ఊపిరాడటం లేదంటున్న పరిసర గ్రామాల ప్రజలు

ఫిర్యాదు చేసినా పట్టని పీసీబీ అధికారులు

హత్నూర, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రసాయన పరిశ్రమలు విషం చిమ్ముతున్నాయి. జల, వాయు కాలుష్యంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ముక్కుపుటలు అదిరే దుర్వాసనతో ఊపిరాడని పరిస్థితి నెలకొంది. అర్ధరాత్రి సమయంలో పరిశ్రమల్లోనే వ్యర్థ జలాలు, వాయువును వదులుతుండటంతో ఎవరికి చెప్పాలో తెలియక ముక్కుమూసుకుని బతుకుతున్నారు. కాలుష్యాన్ని నియంత్రించాల్సిన అధికారులు అటువైపు చూడకపోవడంతో కొన్ని పరిశ్రమల యాజమాన్యాలు ఆడిందే ఆటగా మారింది.



గుండ్లమాచునూరు పరిధిలో..

సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని గుండ్లమాచునూర్ శివారులో పలు పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో కొన్ని పరిశ్రమలు నిబంధనలను గాలికి వదిలేశాయి. పరిశ్రమల నుంచి ప్రమాదకర వాయువులను బయటకు వదిలేస్తున్నారు. వ్యర్థ జలాలను మాత్రం పరిశ్రమ ఆవరణలో నిర్మించిన ట్యాంకుల్లో నిల్వ చేసి పక్కనే ఉన్న నక్కవాగులోకి గుట్టుచప్పుడు కాకుండా వదులుతున్నారు. ఈ కాలుష్యం ధాటికి గుండ్లమాచునూర్ పరిశ్రమల పరిసరాలలోని పంట పొలాల్లో పనిచేసేందుకు కూలీలు రావడం లేదని రైతులు వాపోతున్నారు. కొన్ని పరిశ్రమలు అర్ధరాత్రి వేళ కలుషిత వ్యర్థ జలాలను విడుదల చేస్తుండటంతో గ్రామస్థులు పట్టుకుని పీసీబీ టాస్క్‌ఫోర్సు అధికారులకు ఆ నీటి శ్యాంపిళ్లు, వ్యర్థ జలాలు విడుదల చేస్తున్న పరిశ్రమ వివరాలను అందించారు. అయినా ప్రయోజనం లేకుండా పోయింది. పరిశ్రమల ఆగడాలపై స్థానికులు ఎవరైనా అధికారులకు ఫిర్యాదు చేస్తే బెదిరింపులకు గురి చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

కోర్టులు మొట్టికాయలు వేసినా

గుండ్లమాచునూర్ గ్రామ శివారులోని పరిశ్రమల నుంచి వెలువడుతున్న జల, వాయు కాలుష్యంపై హైకోర్టు మొట్టికాయలు వేసినా పరిశ్రమల యాజమాన్యాల్లో ఎలాంటి మార్పు రావడం లేదు. గ్రామంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన ఓ విద్యార్థి పరిశ్రమల కాలుష్యం తీరుపై జిల్లా కోర్టుతో పాటు హైకోర్టుకు ఉత్తరం రాసి తన ఆవేదనను వెళ్లగక్కాడు. అప్పట్లో కోర్టు ఆదేశాలతో ఆగమేఘాల మీద దిద్దుబాటు చర్యలు చేపట్టినా, ప్రస్తుతం పరిశ్రమలు యథావిధిగానే విషం చిమ్ముతున్నాయి. ఈ విషయమై పీసీబీ ఈఈ గీత సఫారీని 'ఆంధ్రజ్యోతి' సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

చర్యలు శూన్యం

రసాయన పరిశ్రమల నుంచి విడుదలవుతున్న ఆ వాయు కాలుష్యం గురించి నియంత్రణ మండలి అధికారులకు ఫిర్యాదు చేసినా, ప్రయోజనం లేకుండా పోతుందన్న విమర్శలు ఉన్నాయి. అంతే కాకుండా పీసీబీ అధికారులు పరిశ్రమలను తనిఖీ చేసే సమయంలో ముందస్తు సమాచారం ఇచ్చి వస్తున్నట్లు తెలుస్తుంది. పలుమార్లు పరిశ్రమల నుంచి విడుదలయ్యే వ్యర్థ జలాల శాంపిల్స్ సేకరించిన పీసీబీ అధికారులు వారిపై ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

ఐఐటీహెచ్‌లో ముగిసిన 'స్పిక్ మైకే'

కంది, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : సంప్రదాయ, సాంస్కృతిక స్పిక్ మైకే అంతర్జాతీయ వేడుక ఆదివారం ముగిసింది. నేటి తరానికి దేశ శాస్త్రీయ, జానపద, సాహిత్య, సంగీత కళలను పరిచయం చేయాలనే దృక్పథంతో కందిలోని ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో నిర్వహిస్తున్న సదస్సు వారం రోజుల పాటు విద్యార్థులను, దేశ, విదేశాల నుంచి వచ్చిన దాదాపు 1500 మంది కళాకారులను మైమరపింపజేసింది. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ భారతీయ కళలపై స్పిక్ మైకే అంతర్జాతీయ సదస్సును ఐఐటీహెచ్‌లో నిర్వహించడం ద్వారా రేపటి తరానికి సంప్రదాయ, సాంస్కృతిక మార్గదర్శకత్వాన్ని సూచించామని తెలిపారు. వారసత్వ విలువలు అంటే ఏమిటో విద్యార్థులకు తెలియపరుస్తున్నామని పేర్కొన్నారు. ఇది తమకేంతో గర్వకారణమని తెలిపారు.



స్పిక్‌మైకే ప్రతినిధులను ప్రశంసిస్తున్న ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి

ఉత్తమ పోలీసులకు పతకాలు

మెదక్ ఏఎస్పీ ఎస్.మహేందర్ మహోన్నత, సిద్దిపేట ఇంటెలిజెన్స్‌లో సీఐ పల్లె మల్లికార్జున్ కఠిన సేవా పతకాలకు ఎంపిక

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన పోలీసు అధికారులకు ప్రభుత్వం పతకాలను ప్రకటించింది. మహోన్నత, ఉత్తమ, కఠిన సేవా పతకాలకు పలువురు పోలీసు అధికారులు ఎంపికయ్యారు. నేటి అవతరణ వేడుకల్లో వారికి ఈ పతకాలను అందజేయనున్నారు.



సంగారెడ్డి జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు



సీసీఎస్ సీఐ వి.శివకుమార్



మెదక్ అదనపు ఎస్పీ ఎస్.మహేందర్



ఆర్ఎస్ఐ యశ్వంత్‌రావు, మెదక్ జిల్లా



సిద్దిపేట ఇంటలిజెన్స్ సీఐ పల్లె మల్లికార్జున్



సిద్దిపేట హెడ్‌కానిస్టేబుల్ ఎండీ మిస్బాఉద్దీన్

సంగారెడ్డి జిల్లాలో ఎనిమిది మందికి..

సంగారెడ్డి క్రైం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో ముగ్గురికి ఉత్తమ సేవా పతకాలు, ఐదుగురికి సేవా పతకాలు దక్కాయి. అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు, సంగారెడ్డి ఆర్ఎస్ఐ ఎండీ అలీమొద్దీన్, డీసీఆర్‌బీ ఎస్ఐ కె.అంజిరెడ్డి ఉత్తమ సేవా పతకాలకు ఎంపికయ్యారు. సీసీఎస్ సీఐ వి.శివకుమార్, ఏఆర్ఎస్ఐ సయ్యద్ అబ్దుల్ నయీమ్, ఏఎస్ఐ ఎ.యాదగిరి, భానూరు పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ మహ్మద్ అబ్దుల్ రఫీక్ సేవా పతకానికి ఎంపికయ్యారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఏసీబీ సీఐ ఎ.వెంకటేశ్వర్లు సేవా పతకానికి ఎంపికయ్యారు.

మెదక్ జిల్లాలో తొమ్మిది మందికి..

మెదక్ కల్చరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలో తొమ్మిది మంది పోలీసులను పతకాలు వరించాయి. మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్.మహేందర్ మహోన్నత సేవా పతకానికి ఎంపికయ్యారు. ఆర్ఎస్ఐ యశ్వంత్‌రావు ఉత్తమ సేవా పతకాన్ని అందుకోనున్నారు. పాపన్నపేట ఏఎస్ఐ గాలయ్య, మనోహరాబాద్ ఏఎస్ఐ కేవీఎన్ మూర్తి, పోలీస్ స్టేషన్, మెదక్ ఏఆర్ ఎస్ఐ హెచ్. మోహన్, మెదక్ హెడ్‌కానిస్టేబుళ్లు జి.రాములు, ఎం వైద్యనాథ్, ఎం బస్వారాజ్, చేగుంట కానిస్టేబుల్ కె.రాజు సేవా పతకాలకు ఎంపికయ్యారు.

సిద్దిపేట జిల్లాలో ఐదుగురికి..

సిద్దిపేట క్రైం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలో ఐదుగురు పతకాలకు ఎంపిక కాగా, ఒకరికి కఠిన సేవా పతకం వరించింది. హెడ్‌కానిస్టేబుల్‌కు ఉత్తమ సేవా పతకం, ఇద్దరు సీఐలు, ఒక ఏఎస్ఐకి సేవా పతకాలకు ఎంపికయ్యారు. సిద్దిపేటకు చెందిన ప్రస్తుతం ఇంటెలిజెన్స్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న పల్లె మల్లికార్జున్ కఠిన సేవా పతకాన్ని అందుకోనున్నారు. సిద్దిపేట సీసీఆర్బీ హెడ్‌కానిస్టేబుల్ మహమ్మద్ మిస్బాఉద్దీన్‌కు ఉత్తమ సేవా పతకం, చేర్యాల సీఐ శ్రీనివాస్, సిద్దిపేట మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ దుర్గ, సిద్దిపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ రఘుకు సేవా పతకాలు దక్కాయి.

వనదుర్గమ్మ క్షేత్రం.. భక్తిపారవశ్యం



ఏడుపాయల ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు, ఇన్‌సెట్‌లో వనదుర్గామాత

పాపన్నపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్య క్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఆదివారం వారాంతపు సెలవు రోజు కావడంతో ఉమ్మడి జిల్లా వాసులతో పాటు పరిసర జిల్లాలైన నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్, పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్రల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజామున 5.30 గంటలకు అర్చకులు అమ్మవారికి అభిషేకం నిర్వహించి సహస్రనామార్చన, కుంకుమార్చన పూజల అనంతరం దర్శనం కల్పించారు. భక్తులు బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోలీసులు బందోబస్తు చేపట్టారు.

మెదక్ సీఎస్ఐ చర్చిలో భక్తుల సందడి

మెదక్ కల్చరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిలో ప్రెసిబేటరీ ఇన్‌చార్జి బిషప్ శాంతయ్య ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చి లోపలి ప్రార్థన మందిరం భక్తులతో కిక్కిరిసింది. ఏసు నామస్మరణతో మార్మోగింది. చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన సిలువ ముందు భక్తులు కొబ్బరికాయలు కొట్టి, కొవ్వొత్తులను వెలిగించి, మొక్కులు తీర్చుకున్నారు. మత గురువులు భక్తులను ఆశీర్వచనాలను అందించారు. వేసవి కావడంతో కుటుంబ సభ్యులతో కలిసి విందు భోజనాలు చేస్తూ సేద తీరారు.



మెదక్ సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

అనుమానంతో భార్యను చంపిన భర్త

● కొండపాకలో ఘటన

కొండపాక, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : వివాహేతర సంబంధం అనుమానంతో భర్త భార్యను పారతో తలపై కొట్టి హతమార్చిన ఘటన కొండపాకలో చోటుచేసుకున్నది. ఇందుకు సంబంధించి కుకునూరు పల్లి పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపాక గ్రామానికి చెందిన పొన్నాల మల్లేశం(49) సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన యశోదతో 2003 సంవత్సరంలో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఆరు నెలల నుంచి మల్లేశం భార్య యశోదతో గొడవ పడుతూ కొడుతుండేవాడు. అప్పుడప్పుడు ఇంట్లో నుంచి వెళ్లిపోయి తిరిగి వచ్చేవాడు. ఇంట్లో పదేపదే గొడవ పడుతుండడంతో కుటుంబీకులు బంధువులు, గ్రామస్థులు నచ్చజెప్పినప్పటికీ, అలాగే వ్యవహరించాడు. ప్రతీ చిన్న విషయానికి గొడవపడి కొట్టేవాడు. భార్యతో గొడవపడి వారం రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయిన ఆయన శనివారం తిరిగి గ్రామానికి చేరుకొని ఇంటికి వచ్చాడు. యశోద(45) గ్రామంలోని కేజీబీవీ పాఠశాలలో హాస్టల్లో పనిచేస్తుంది. మధ్యాహ్నం పని ముగించుకొని ఇంటికి వచ్చింది. ఇంటికి వచ్చిన యశోదతో ఏమీ మాట్లాడకుండా మల్లేశం బయటకు వెళ్లిపోయాడు. బయటకు వెళుతున్న ఆయనను భార్య యశోద, కూతురు అనూష వెళ్లి అడ్డగించారు. ఎందుకు తిరుగుతున్నావు, ఎక్కడికి వెళ్తున్నావు అని అడ్డుకొని ఇంటికి రమ్మని పిలిచారు. దాంతో ఆయన తిట్టుకుంటూ ముందుకు వెళ్లి ఇంటి ముందు గడ్డపార తీసుకొని యశోద తలపై కొట్టాడు. దాంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు వెంటనే అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సిద్దిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలు సోదరుడు యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

ఆదివారం ఉమ్మడి జిల్లాలో చోటుచేసుకున్న వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో బ్రిడ్జిపై నుంచి లారీ పడి డ్రైవర్ దుర్మరణం పాలవగా, క్లీనర్‌కు గాయాలయ్యాయి. సిద్దిపేట జిల్లా కొండపాక మండలంలో లారీని వెనుక నుంచి కారు ఢీకొనడంతో ఇద్దరు తీవ్రగాయాలపాలయ్యారు. మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలో బైక్‌పై నుంచి పడి వృద్ధురాలు మృతిచెందింది.

జహీరాబాద్‌లో లారీ డ్రైవర్ దుర్మరణం, క్లీనర్‌కు గాయాలు

శివ్వంపేట మండలంలో బైక్‌పై నుంచి పడి వృద్ధురాలి మృతి

కొండపాక మండలంలో లారీని కారు ఢీకొనగా ఇద్దరికి గాయాలు



జహీరాబాద్‌లో బ్రిడ్జిపై నుంచి పడిన లారీ

జహీరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : నిద్రమత్తులో బ్రిడ్జిపై నుంచి లారీ కిందపడి డ్రైవర్ మృతిచెందిన సంఘటన జహీరాబాద్ పట్టణంలోని పస్తాపూర్ వద్ద ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. ఎస్ఐ కాశీనాథ్ తెలిపిన వివరాల మేరకు.. ఏపీ 16 టీహెచ్9687 నంబరు గల లారీ కడప నుంచి ఐరన్‌స్క్రాప్ తీసుకుని గుజరాత్‌కు వెళ్తున్నారన్నారు. జహీరాబాద్‌కు రాగానే డ్రైవర్ నిద్ర మత్తులో లారీని నడుపుతుండగా, పట్టణంలోని పస్తాపూర్ బైపాస్ వద్ద బ్రిడ్జిపై నుంచి కింద పడింది. దీంతో డ్రైవర్ రమేష్ (47) క్యాబిన్‌లో ఇరుక్కుని అక్కడికక్కడే మృతిచెందాడు. క్లీనర్ వీరేశంకు బలమైన గాయాలు కాగా, మెరుగైన చికిత్స నిమిత్తం సంగారెడ్డికి తరలించారు. మృతుడు డ్రైవర్ రమేష్‌ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైఎస్సార్ కడప జిల్లాలోని లింగాల గ్రామం. క్లీనర్ పాముల వీరేశంది సత్యసాయి జిల్లాలోని నాగసముద్రం. ఈమేరకు డ్రైవర్ రమేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు.

బైక్‌పై నుంచి పడి వృద్ధురాలి మృతి

శివ్వంపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనంపై నుంచి పడి వృద్ధురాలు మృతిచెందిన సంఘటన శివ్వంపేట మండల పరిధిలో ఆదివారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రమైన శివ్వంపేటకు చెందిన కోవూరి సత్యమ్మ(70) బంధువుతో బైక్‌పై తూప్రాన్ ఆస్పత్రికి వెళ్తున్నది. ఈ క్రమంలో సుభాష్‌పల్లి సమీపంలో బైక్ నుంచి పడింది. వెంటనే ఆమెను దగ్గరలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే సత్యమ్మ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.



సత్యమ్మ (ఫైల్)

రాజీవ్‌రహదారిపై ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కొండపాక, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ముందు వెళ్తున్న లారీని కారు వెనుక వైపు ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి శివారులో రాజీవ్ రహదారిపై ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట వైపు నుంచి హైదరాబాద్ వెళుతున్న కారు తిమ్మారెడ్డిపల్లి శివారులో ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. దీంతో కారు డివైడర్‌కు తాకి అటు వైపు రోడ్డుపైకి దూసుకెళ్లింది. ఆ కారులో ప్రయాణం చేస్తున్న కరీంనగర్‌కు చెందిన రవికుమార్, రాజకుమార్ అనే ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



తిమ్మారెడ్డిపల్లి రాజీవ్ రహదారిపై ప్రమాదంలో ధ్వంసమైన కారు

మహీంద్రా కర్మాగారంలో ఎన్నికల కోలాహలం

● కార్మిక సంఘ అధ్యక్షుడి పదవికి హోరాహోరీ

● సీఐటీయూ వర్సెస్ ఐఎన్‌టీయూసీ



జహీరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ సమీపంలోని మహీంద్రా కర్మాగారంలో కార్మిక సంఘం ఎన్నికల సందడి మొదలైంది. రెండేళ్లకోసారి జరిగే ఈ ఎన్నికల్లో కర్మాగారం ఏర్పాటైన నాటి నుంచి ఇప్పటివరకు సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, హెచ్ఎంఎస్, టీఎంఎస్, బీఎంఎస్ కార్మిక సంఘాలు పోటీ చేస్తూ వచ్చాయి. 1983-84లో 150 మంది పర్మినెంట్ కార్మికులతో ప్రారంభమైన ఈ కర్మాగారంలో ఇప్పుడు కార్మికుల సంఖ్య 543కి చేరింది. 1987 కార్మిక సంఘం ఎన్నికలను నిర్వహిస్తున్నారు. ఐఎన్‌టీయూసీ ఆరు సార్లు, సీఐటీయూ ఆరు సార్లు, హెచ్ఎంఎస్, టీఎంఎస్ యూనియన్లు రెండు సార్లు గెలుపొందాయి. కార్మిక సంఘ అధ్యక్షుడిగా ఎక్కువసార్లు ఐఎన్‌టీయూసీ నేత, దివంగత ఖైరతాబాద్ ఎమ్మెల్యే పి.జనార్దన్‌రెడ్డి ఉన్నారు. దివంగత నేత నాయిని నర్సింహారెడ్డి, మాజీ మంత్రి హరీశ్‌రావు కార్మిక నేతలుగా ఎన్నుకోబడ్డారు. చుక్క రాములు, మదన్‌మోహన్‌రావు కార్మికసంఘం నేతలుగా ఎన్నికైన వారిలో ఉన్నారు.

జూన్ 5న మహీంద్రాలో కార్మిక సంఘం ఎన్నికలు

మహీంద్రా కర్మాగారంలో కార్మిక సంఘం అధ్యక్ష పదవీకాలం ఏప్రిల్ 2025తో ముగిసింది. ఎన్నికల నిర్వహించేందుకు కార్మికశాఖ అధికారులు మే 29న నోటిఫికేషన్‌ను జారీ చేశారు. జూన్ 5న ఎన్నికలను నిర్వహించనున్నారు. సుమారు 543 మంది పర్మినెంట్ కార్మికులు ఉండగా, వారు ఆయా ట్రేడ్ యూనియన్ల తరఫున బరిలో ఉన్నవారికి ఓట్లు వేయనున్నారు. ఈసారి జరిగే ఎన్నికల్లో సీఐటీయూ అభ్యర్థి చుక్క రాములు, ఐఎన్‌టీయూసీ తరఫున జనక్‌ప్రసాద్ పోటీపడుతున్నారు. ఇప్పటి వరకు కార్మికులకు మంచి వేతనాన్ని ఇప్పించామని సీఐటీయూ నాయకులు చెబుతుండగా, ఐఎన్‌టీయూసీ నాయకులు మాత్రం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని ప్రభుత్వ పరమైన సమస్యలేమైనా పరిష్కరించేలా కృషి చేయడంతో పాటు మంచి వేతన ఒప్పందం చేయిస్తామని ఓట్లు వేయాలంటూ కార్మికులను కోరుతున్నారు. ఎవరికి వారు కార్మికుల మద్దతును కూడ గట్టుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. సోమవారం ఐఎన్‌టీయూసీ, రేపు సీఐటీయూ నాయకులు కర్మాగారం ఎదుట గేట్‌మీటింగ్ నిర్వహించనున్నారు. విజయంపై ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్ బాక్స్

గాంధీ విగ్రహం ఆవిష్కరణ

నర్సాపూర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ మండలం మాడాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ విగ్రహాన్ని పీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశం, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయ్, మాజీ ఎంపీటీసీ గుర్రాలఅశోక్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు

కొండాపూర్, జూన్1 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మల్లేపల్లి హనుమాన్ మందిరంలో మంగళవారం నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో ధ్వజస్తంభం అవిష్కరణతో పాటు, సీతారాములు, సుబ్రమణ్య స్వాములు, పార్వతీ దేవి, నంది విగ్రహలను ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవతల కృపకు ప్రీతి పాత్రులు కావాలని కోరారు.

ఈ నెల 3 నుంచి 'భూభారతి' గ్రామసభలు

అల్లాదుర్గం /కంగ్టి/ నారాయణఖేడ్/ నాగల్‌గిద్ద /కోహీర్/ జూన్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ భారతి గ్రామ సభలను ఆయా మండలాల్లో ఈ నెల 3 నుంచి నిర్వహించనున్నట్లు అల్లాదుర్గం తహసీల్దార్ మల్లయ్య, కంగ్టీ తహసీల్దార్ భాస్కర్, నారాయణఖేడ్ ఇన్‌చార్జి తహసీల్దార్ రాజు పటేల్, నాగల్‌గిద్ద ఇన్‌చార్జి తహసీల్దార్ శివకృష్ణ, కోహీర్ మండల ఇన్‌చార్జి తహసీల్దార్ ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే ఈ సభలకు రైతులు హాజరై భూ సమస్యల పరిష్కారం కోసం ఆర్జీలు పెట్టుకోవాలని పేర్కొన్నారు

కాలువను శుభ్రం చేయాలి

రామచంద్రాపురం టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : కాలనీలోని వరద కాలువను శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకోవాలని భారతీనగర్ డివిజన్ పరిధి విద్యుత్నగర్ కాలనీవాసులు కోరారు. ఈ మేరకు ఆదివారం కార్పొరేటర్ సింధూఆదర్శరెడ్డికి వినతిపత్రం అందజేశారు. వర్షాలు కురుస్తున్న సమయంలో కాలువలో మురుగు మట్టి పేరుకుపోయి ఇళ్లల్లోకి నీళ్లు చేరుతున్నాయని వివరించారు. దోమల నివారణ మందు పిచికారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అజీమ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులను అవమానించిన కార్యదర్శిని సస్పెండ్ చేయాలి

నిజాంపేట, జూన్ 1(ఆంధ్రజ్యోతి): దళిత విద్యార్థులను అవమాన పరిచిన గురుకుల కార్యదర్శిని అలుగు వర్షిణిని సస్పెండ్ చేసి, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి శంకర్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాట చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులను కులం పేరుతో దూషించడమే కాకుండా, క్లీనింగ్ చేయాలన్న సూచనలను ప్రశ్నించే తల్లిదండ్రులు, పిల్లలపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయడం సిగ్గుచేటన్నారు. నాయకులు సంజీవ్, ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షులు గర్గుల శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ కొమ్మట బాబు, బ్యాగరి రాజులు ఉన్నారు.

'నీలకంఠ సమాజ సభ్యులు రాజకీయంగా ఎదగాలి'

పెద్దశంకరంపేట, జూన్ 1(ఆంధ్రజ్యోతి): నీలకంఠ సమాజ సంఘం సభ్యులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని తెలంగాణ రాష్ట్ర(అఖిల భారతీయ) నీలకంఠ సమాజ సంఘం అధ్యక్షుడు లక్ష్మీ రాజ్యం పిలుపునిచ్చారు. ఆదివారం పెద్దశంకరంపేటలో (నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా నీలకంఠ సమాజం జనగణన చేపట్టాలన్నారు. గౌరవ అధ్యక్షుడు నర్సింహులు, ప్రధాన కార్యదర్శి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

4న సెంట్రల్ జైలులో మామిడిపండ్ల వేలం

కంది, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : కంది పరిధిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలులో ఈ నెల 4న ఉదయం 10 గంటలకు జైలు ఆవరణలోని మామిడిచెట్లకు కాసిన పండ్లకు వేలంపాట నిర్వహించనున్నట్లు జైలు సూపరింటెండెంట్ సంతోష్ కుమార్ రాయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జైలు ఆవరణలో ఎలాంటి రసాయనాలు వాడకుండా సేంద్రియ ఎరువులతో పండించిన మామిడిపండ్లలో దశేరీ, బంగినపల్లి, పెద్దరసాలు, మల్లిక, బేబిషాన్, షాగ వంటి వివిధ రకాలు ఉన్నాయని వివరించారు. ఆసక్తి గలవారు రూ.5 వేలు డిపాజిట్ చేసి వేలం పాటలో పాల్గొనాలని పేర్కొన్నారు. చెట్ల సంరక్షణలో అనుభవం కలిగి ఉండి, రైతు గుర్తింపు కార్డు లేదా ఆధార్‌కార్డు వెంట తీసుకురావాలని, వేలంపాటకు గంట ముందు డబ్బులు డిపాజిట్ చేయాలని తెలిపారు. . మరిన్ని వివరాలకు 9494632158, 9494632159 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఉమ్మడి జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష

సమావేశంలో పాల్గొన్న నిర్మలాజగ్గారెడ్డి



సంగారెడ్డి కలెక్టరేట్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా సమావేశంలో మంత్రి దామోదర రాజనర్సింహతో మాట్లాడుతున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి



సంగారెడ్డి కలెక్టరేట్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా అధికారుల సమీక్ష సమావేశంలో పాల్గొన్న నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డి అర్బన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతితో పాటు మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ పాల్గొన్న ఈ సమావేశంలో నిర్మలాజగ్గారెడ్డి హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించేలా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్న ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని నిర్మలాజగ్గారెడ్డి స్పష్టం చేశారు.

మురుగు ముప్పు ఉండదిక

- జోగిపేట పట్టణంలో రూ. 2.40 కోట్లతో డ్రైనేజీల నిర్మాణం
- ప్రారంభమైన పనులు.. నెల రోజుల్లో పూర్తికి చర్యలు
- మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం



హనుమాన్ మందిరం వద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం తెచ్చిన పైపులు

జోగిపేట, మే31(ఆంధ్రజ్యోతి): అందోలు- జోగిపేట మున్సిపాలిటీలో అతి ప్రధానమైన మురుగు నీటి సమస్యకు చెక్ పడనున్నది. రూ.2.40 కోట్లతో చేపడుతున్న డ్రైనేజీ పనులతో ఎంతోకాలంగా జోగిపేట పట్టణం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనున్నది. పట్టణంలోని ప్రధాన రహదారి (గతంలో జాతీయ రహదారి) అయిన హౌజింగ్‌బోర్డు కాలనీలోని అయ్యప్ప మందిరం నుంచి జోగినాథ ఆయిల్ వరకు రెండు వైపులా మురుగు కాల్వలు లేకపోవడంతో మురుగంతా రోడ్డుపైనే పారుతున్నది. కనీసం వర్షపు నీటి కాల్వలు కూడా లేకపోవడంతో ప్టణంలోని హనుమాన్ మందిరం నుంచి పోలీస్ స్టేషన్ వరకు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎదుట నీరు నిలిచి వాహనాల రాకపోకలకు తీవ్రం ఆటంకం కలుగుతున్నది. మరో ప్రధాన రహదారి గౌని చౌరస్తా నుంచి పోచమ్మ ఆలయం మీదుగా హనుమాన్ మందిరం వరకు పరిస్థితి మరింత దారుణంగా ఉండేది. సుమారు 30 ఏళ్ల క్రితం నిర్మించిన మురుగు కాల్వలు ప్రస్తుత పెరిగిన జనాభా దృష్ట్యా సరిపోకపోవడం, పూడిక తీయకపోవడంతో మురుగు రోడ్డుపై పరుగు పెడుతున్నది. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

డ్రైనేజీల నిర్మాణం..

ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అధికారులు నడుం బిగించారు. అందుకోసం రూ.2.40 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులతో డ్రైనేజీ కాల్వల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సుమారు 1.2 కి.మీ మేర అండర్ గ్రౌండ్, మరో 900 మీటర్ల మేర బాక్స్ డ్రైనేజీ పనులను చేపడుతున్నారు. ఇప్పటికే గౌని చౌరస్తా నుంచి పోచమ్మ ఆలయం మీదుగా హనుమాన్ మందిరం వరకు సుమారు 600 మీటర్ల మేర రోడ్డుకు ఇరువైపులా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తయ్యాయి. హనుమాన్ మందిరం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు రోడ్డుకు ఎడమ వైపు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పసనులు షురూ అయ్యాయి. దీని తరువాత హనుమాన్ మందిరం నుంచి కూరగాయల మార్కెట్ వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టనున్నారు. రాయల్ పాన్ షాప్ చౌరస్తా నుంచి పోలీస్ స్టేషన్ వరకు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ముందు కొంత భాగం, ఉన్న దశాబ్దాల క్రితం నాటి మురుగు కాల్వ ధ్వంసం కావడంతో. అక్కడ నూతనంగా సుమారు 450 మీటర్ల మేర బాక్స్ డ్రైనేజీ నిర్మించనున్నారు. హౌజింగ్ బోర్డు కాలనీలోని బీజేపీ ఆఫీస్ నుంచి అయ్యప్ప ఆలయం వరకు మరో 400 మీటర్ల మేర మరో బాక్స్ డ్రైనేజీ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.

నెలలోపు పనులు పూర్తి



మురుగు కాల్వల నిర్మాణం పనులు ప్రారంభించాం. ఈ పనులన్నీ జూన్ నెలాఖరు లోపు పూర్తి చేస్తాం. దీంతో, పట్టణంలోని ప్రధాన రోడ్లపై మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనున్నది.

-తిరుపతి, మున్సిపల్ కమిషనర్



మురుగు కాల్వ నిర్మాణం కోసం ఇళ్ల ముందున్న ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

నారాయణఖేడ్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి కోరారు. మనూరు మండలం బోరంచ గ్రామానికి చెందిన బందెల్లి రజాక్‌కు రూ.60వేలు, ఎన్‌జీ హుక్రానకు చెందిన దూదెకుల జహీరాబీకి రూ.36 వేల సీఎంఆర్ఎఫ్ మంజూరు కాగా, ఆదివారం వారికి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దిలీప్‌రెడ్డి, అఖిలేష్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు ఉన్నారు. అలాగే స్థానిక సాయిబాబా ఫంక్షన్ హాల్‌లో జరిగిన పోతన్‌పల్లి పాఠశాల ఎల్ఎఫ్ఎల్ పాఠశాల హెచ్ఎం.నెహ్రూనాయక్ ఉద్యోగ విరమణ సభకు ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, బీజేపీ ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షులు అమర్‌సింగ్, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్ తదితరులు పాల్గొని నెహ్రూనాయక్, శారద దంపతులను ఘనంగా సన్మానించారు.



ఖేడ్‌లో ఉద్యోగ విరమణ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



నాగూర్.కె లో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

'తెగుళ్ల నివారణకు విత్తన శుద్ధి తప్పనిసరి'

కంగ్టి/కౌడిపల్లి/మాసాయిపేట, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రైతులు పంటలను సాగు చేసే ముందు తప్పని సరిగా విత్తనశుద్ధి చేయాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, అధికారులు రైతులకు సూచించారు. వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ఆదివారం కంగ్టి మండల పరిధిలోని నాగూర్.కె , కౌడిపల్లి మండలంలోని కంచన్‌పల్లి, మాసాయిపేట మండలంలోని పోతనపల్లి, అచ్చంపేట గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. పంటలకు తెగుళ్లు సోకకుండా ఉండేందుకు ట్రైకోడర్మతో విత్తన శుద్ధి చేయాలన్నారు. నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో శాస్త్రవేత్తలు సాయి ప్రియాంక, స్నేహలత, స్వామి, అరుణ, ఏఈవో సంతోష్, వాటర్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ రవిప్రసాద్, కృషి విజ్ఞాన కేంద్రం తునికి శాస్త్రవేత్త డాక్టర్ చిన్నబాబు నాయక్, ఐఐఆర్ శాస్త్రవేత్త డాక్టర్ జెసుదాసు, మండల వ్యవసాయ అధికారి స్వప్నజాదవ్, వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రసన్నకుమార్, రవికుమార్ , కిరణ్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సర్దుబాటుకు కసరత్తు

(3వ పేజీ తరువాయి)

ఒకే బడిగా పరిగణిస్తారు. ఒకే ప్రాంగణంలో రెండు ఉన్నత పాఠశాలలుంటే ఒక స్కూల్‌గానే పరిగణించి సర్దుబాటు చేస్తారు.

జిల్లాలో 640 టీచర్ల ఖాళీలు

సంగారెడ్డి జిల్లాలో ,6013 టీచర్ పోస్టులు మంజూరి ఉండగా ప్రస్తుతం 5,373 మంది పనిచేస్తున్నారు. 640 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గతేడాది జిల్లాలో 156 మంది టీచర్లను ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేసినట్టు అధికారులు తెలిపారు. గత ఫిబ్రవరిలో 2008-డీఎస్సీలో ఎంపికైనా 67 మందిని కాంట్రాక్ట్ టీచర్లుగా నియమించారు. ఈ నేపథ్యంలో గతేడాది కంటే తక్కువ మందిని సర్దుబాటు చేయాల్సిన ఏడాది ఉపాధ్యాయుల సర్దుబాటు సంఖ్య తగ్గవచ్చని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.బడిగా పరిగణిస్తారు. ఒకే ప్రాంగణంలో రెండు ఉన్నత పాఠశాలలుంటే ఒక స్కూల్‌గానే పరిగణించి సర్దుబాటు చేస్తారు.

జిల్లాలో 640 టీచర్ల ఖాళీలు

సంగారెడ్డి జిల్లాలో ,6013 టీచర్ పోస్టులు మంజూరి ఉండగా ప్రస్తుతం 5,373 మంది పనిచేస్తున్నారు. 640 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గతేడాది జిల్లాలో 156 మంది టీచర్లను ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేసినట్టు అధికారులు తెలిపారు. గత ఫిబ్రవరిలో 2008-డీఎస్సీలో ఎంపికైనా 67 మందిని కాంట్రాక్ట్ టీచర్లుగా నియమించారు. ఈ నేపథ్యంలో గతేడాది కంటే తక్కువ మందిని సర్దుబాటు చేయాల్సిన ఏడాది ఉపాధ్యాయుల సర్దుబాటు సంఖ్య తగ్గవచ్చని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.



జిన్నారం నుంచి బొంతపల్లి కమాన్ రహదారిపై నిలిపిన భారీ వాహనాలు

పార్కింగ్ ఇలా.. ప్రయాణమెలా?

జిన్నారం, జూన్, 1 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక వాడల్లో నిత్యం రహదారులపై ఇష్టారాజ్యంగా చేస్తున్న వాహనాల పార్కింగ్‌తో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం జిన్నారం నుంచి బొంతపల్లి కమాన్ వెళ్లే రోడ్డుపై పలు రసాయన పరిశ్రమలకు వచ్చిన భారీ స్థాయి వాహనాలు రోడ్డుకు ఇరు వైపులా నిలిపి ఉంచగా ఎదురుగా వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రమాదాలు కూడా జరిగే అకాశమున్నది. నిత్యం పారిశ్రామిక వాడల్లో ఇదే పరిస్థితి ఉన్నా సంబంధిత అధికారులు స్పందించటం లేదని వాహనదారులు, పరిశ్రమల కార్మికులు వాపోతున్నారు.

నీటి పంపింగ్‌కు భారీ మోటార్



భారీ పంపింగ్ విద్యుత్ మోటరు

తూప్రాన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూప్రాన్ మండలంలో నీటి పంపింగ్ చేసేందుకు పట్టణంలోని మిషన్ భగీరథ పంప్ హౌస్‌లో భారీ మోటారు ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి మనోహరాబాద్, తూప్రాన్ మండలాల్లోని కొన్ని గ్రామాలకు మిషన్ భగీరథ తాగునీటిని పంపింగ్ చేస్తుంటారు. ప్రస్తుతం సాధారణ మోటర్లతో పంపింగ్ చేస్తున్నారు. ప్రస్తుతం సుమారు రూ.3 లక్షల వ్యయంతో 120 హెచ్‌పీ మోటారు ఏర్పాటు చేశారు. పంపింగ్‌లో సమస్యలు ఏర్పడితే అత్యవసరంగా నీటిని పంపింగ్ చేసేందుకు దీన్ని వినియోగించనున్నారు.

సేవాలాల్ గుడికి రూ.లక్ష విరాళం



నగదు అందజేస్తున్న మైనంపల్లి హనుమంతరావు

రామాయంపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రామాయంపేట మున్సిపల్ పరిధి సేవాలాల్ గుడికి నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు రూ. లక్ష విరాళాన్ని ఆదివారం అందజేశారు. రామయంపేట వచ్చిన మైనంపల్లి సేవాలాల్ కమిటీ బృందాన్ని నగదు ఇచ్చారు. ఆయన వెంట సుప్రభాత్ రావు, అల్లాడి వెంకటి, రమేష్ రెడ్డి, సరాఫ్ యాదగిరి, కోటి యుగంధర్, దేమే యాదగిరి, శారద రాజు, చింతల స్వామి, విప్లవ్, వినయ్ సాగర్ ఉన్నారు.

గౌతమ బుద్ధుడి విగ్రహం ఆవిష్కరణ



ఇటికేపల్లి గ్రామంలో బుద్ధుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాయికోడ్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): గౌతమ బుద్ధుడు బోధించిన పంచ శిల సూత్రాలను పాటించాలని ఉపాధ్యాయులు కవి రాంచందర్ బీమ్ వంశీ, జిల్లా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు రామారావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఇటికేపల్లి గ్రామంలో బౌద్ధ భిక్షులు భిక్షు సంఘపాల్ బంతే గారిచే గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారుతి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శంకర్, మాజీ సర్పంచ్ రవీందర్, జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్, ఇమ్మయ్య, బౌద్ధ భిక్షు అనిల్, మాజీ ఎంపీటీసీ పండరి, మాజీ సర్పంచు కృష్ణారెడ్డి, పెంటయ్యముదిరాజ్, సంఘం మండల అధ్యక్షులు రాజు, మశ్చందర్, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎఫ్ జవాన్‌కు సన్మానం



జవాన్‌ను సన్మానిస్తున్న ఎస్ఐ, పద్మశాలి సంఘం ప్రతినిధులు

రామాయంపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల సిందూర్ ఆపరేషన్‌లో విధులు నిర్వర్తించిన జవాన్ విజయ్‌కుమార్ ఆదివారం రామాయంపేట పద్మశాలీ సంఘం సభ్యులు సన్మానించారు. ఎస్ఐ బాల్‌రాజ్ పాల్గొని అభినందించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు మద్దెల రమేష్, యాదగిరి, మద్దెల సత్యం, కైరంకొండ రాజమౌళి, బల్ల సుధాకర్ మోహన్, రామచంద్రం, రాములు పాల్గొన్నారు.

రేగోడు మండలానికి 440 ఇందిరమ్మ ఇళ్లు

రేగోడు జూన్ 1(ఆంధ్రజ్యోతి): రేగోడు మండలానికి 440 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. ఆదర్శ గ్రామంగా ఎంపికైన గజ్వాడ గ్రామానికి 160, మిగిలిన 17 గ్రామ పంచాయతీలకు 280 గృహాలు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఇప్పటికే గజవాడ గ్రామంలో నిర్మాణాలు జరుగుతున్నాయి. నిబంధనల ప్రకారం ఇల్లు నిర్మిస్తేనే బిల్లులు వస్తాయని ఎంపీడీవో సీతారావమ్మ తెలిపారు. రేగోడు ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ భవనం ప్రకారం నిర్మాణం చేపట్టాలన్నారు. ఇందిరమ్మ గృహాలు మంజూరైనా లబ్ధిదారుల జాబిత గ్రామ పంచాయతీ కార్యదర్శుల వద్ద ఉందని పేర్కొన్నారు.

కొలిక్కి రాని 'వికాసం'

(3వ పేజీ తరువాయి)

సమాచారం. రూ.2 లక్షల లోపు రుణాలు జూలైలో, రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల లోపు వారికి ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో రుణాలు మంజూరు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

రాజకీయ జోక్యంతోనే ఆలస్యం

లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ నేతల ప్రమేయం ఉండడంతోనే జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. రానున్న రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తుండడంతో ఈ లబ్ధిదారుల ఎంపిక కొత్త తలనొప్పుల్ని తీసుకువస్తుందని పలువురు నేతలు వాపోతున్నారు.

వేడుకల్లో శకటమూ కష్టమే..

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సందర్భంగా జిల్లా కేంద్రంలో వివిధ ప్రభుత్వ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభిస్తోంది. రాజీవ్ యువవికాసం పథకాన్ని నేడు ప్రారంభిస్తుండగా, లబ్ధిదారుల ఎంపిక పూర్తికాకవడంతో రుణ మంజూరు పత్రాల జారీ చేయడం లేదని తెలుస్తోంది. అలాగే, వేడుకల్లో రాజీవ్ యువవికాసం శకట ప్రదర్శన ఉండబోవడం లేదని ఓ అధికారి తెలిపారు. జిల్లావ్యాప్తంగా సుమారు 32 వేల నిరుద్యోగులు స్వయం ఉపాధి కోసం దరఖాస్తులు చేసుకున్న రాజీవ్ యువవికాస్ పథకం గూర్చి వివరించే శకట ప్రదర్శన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ప్రదర్శనకు నోచుకోకపోవడం విడ్డూరమని పలువురు వాపోతున్నారు.